సింగిల్ చార్జింగ్‌తో 1,000 కిలోమీటర్లు

ఫోక్స్‌వ్యాగన్ నుంచి సరికొత్త ఈవీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: ఫోక్స్‌వ్యాగన్.. మార్కెట్లోకి మరో ఎలక్ట్రిక్ వాహనాన్ని విడుదల చేయడానికి సిద్ధమైంది. సింగిల్ చార్జింగ్‌తో 1,000 కిలోమీటర్లు ప్రయాణించే ఈ మాడల్‌ను చైనాలోని షాంఘైలో జరుగుతున్న ఆటోలో ప్రదర్శించింది. చైనాకు చెందిన భాగస్వామితో తయారు చేస్తున్న ఈ కారు 2027లో ఉత్పత్తిని ప్రారంభించనున్నట్టు ప్రకటించింది. కృత్రిమ మేధస్సు ఇంటిగ్రేషన్‌తో తయారైన ఈ మూడు ఎస్‌యూవీలు సింగిల్ చార్జింగ్‌తో 700-1,000 కిలోమీటర్ల వరకు ప్రయాణించనున్నది.

మీ జాగ్రత్తలే మీకు రక్ష

మదుపరులకు బీఎస్ఈ సీఈవో రామమూర్తి హితవు

కోల్‌కతా, ఏప్రిల్ 24: మదుపరులకు అవగాహన, బాధ్యతల ప్రాధాన్యాన్ని నొక్కిచెప్పారు.. పెట్టుబడులు పెట్టేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఎన్ని నియమనిబంధనలున్నా రక్షణ లభించదని బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ఎండీ, సీఈవో సుందరరామన్ రామమూర్తి అన్నారు. 'మీ ట్రేడింగ్ మీకున్న అవగాహనను, మీ అవగాహన మీ ట్రేడింగ్‌ను ప్రతిబింబించాలి. లేకపోతే మీరు సమస్యల్లో పడతారు' అని గురువారం ఇక్కడ కలకత్తా చాంబర్ ఆఫ్ కామర్స్‌లో 'రిటైల్ భాగస్వామ్యం' అంశంపై మాట్లాడుతూ చెప్పారు. ఈ క్రమంలోనే ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. వదంతులను నమ్మి మదుపరులు పెట్టుబడులకు దిగుతుండటాన్ని విమర్శించారు. అలాగే మదుపరులు నష్టపోయినప్పుడు రెగ్యులేటర్లను నిందించడం, అదే మదుపరులు లాభాలను అందుకున్నప్పుడు వారి తెలివితేటల్ని ప్రశంసించడం సరికాదన్నారు. ఈ క్రమంలోనే మదుపరులంతా ఎవరికివారు వ్యక్తిగతంగా తగు జాగ్రత్తలు తీసుకోకపోతే రెగ్యులేటర్లు కూడా ఏమీ చేయలేరని స్పష్టం చేశారు. నష్టాలు తప్పవని హెచ్చరించారు.

మ్యూచువల్ ఫండ్లు మేలు

మార్కెట్ తీరుతెన్నులపై అవగాహనలేని చిన్న మదుపరులు.. మ్యూచువల్ ఫండ్స్‌ను ఎంచుకోవాలని రామమూర్తి ఈ సందర్భంగా సూచించారు. అలాగే మహిళలు, యువత కెరియర్ తొలినాళ్ల నుంచే పెట్టుబడులను ప్రారంభించాలన్నారు. ఇక ఎస్ఎంఈలు స్టాక్ మార్కెట్లలో తక్కువగా నమోదవుతున్నాయని, వ్యాపారాభివృద్ధికి కావాల్సిన నిధుల సమీకరణ కోసం ఈక్విటీల్లోకి ప్రవేశాన్ని ఉపయోగించుకోవాలని సలహా ఇచ్చారు. స్టాక్ మార్కెట్లలోకి ప్రవేశించే సామర్థ్యం 1,000కి పైగా ఎస్ఎంఈలకు ఉన్నా.. 40 మాత్రమే ట్రేడ్ అవుతుండటం నిరాశపరుస్తున్నదని చెప్పారు. ఎస్ఎంఈ లిస్టింగ్‌ల్లో అక్రమాలను కొట్టిపారేయలేమన్న ఆయన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రేట్లను తగ్గించిన మరో రెండు బ్యాంకులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంకులు ఆర్ఎల్ఎల్ఆర్‌ని 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. దీంతో గృహ, వాహన రుణాలపై వడ్డీ రేట్లు మరింత తగ్గనున్నాయి. ఇండియన్ బ్యాంక్ గృహ రుణాలపై వడ్డీరేటు 8.15 శాతం నుంచి 7.90 శాతానికి దిగిరాగా, వాహన రుణాలపై వడ్డీరేటు 8.50 శాతం నుంచి 8.25 శాతానికి తగ్గింది. దీంతోపాటు ప్రాసెసింగ్ ఫీజులో రాయితీ ఇచ్చిన బ్యాంక్..డాక్యుమెంటేషన్ చార్జీని పూర్తిగా ఎత్తివేసింది. అలాగే కెనరా గృహ రుణాలపై వడ్డీ 7.90 శాతంగాను, వాహన రుణాలపై 8.20 శాతంగా ఉన్నది.

పాక్‌కు పహల్గాం సెగ

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి పెనం మీదనుంచి పొయ్యిలోపడ్డ చందంగా తయారైంది.

ఇప్పటికే దేశాన్ని అక్కడ ఇక్కడ తెచ్చిన అప్పులతో నెట్టుకొస్తున్న పాక్ సర్కారుకు.. భారత్ నిర్ణయాలు శరాఘాతంలా మారాయి మరి.

సింధూ జలాల ఒప్పందం నిలిపివేత, వాఘా-అట్టారి మార్గం మూసివేత దాయాది దేశం సాగు-త్రాగునీటి అవసరాలను, వాణిజ్య సంబంధాలను గట్టిగానే దెబ్బ తీస్తున్నాయి.

భారత్‌తో వాణిజ్యానికి బ్రేక్

ఉగ్రదాడి నేపథ్యంలో వాఘా-అట్టారి మార్గం బంద్

సింధూ జలాల ఒప్పందం నిలిపివేతతో పెను ప్రభావం

ఇప్పటికే అప్పుల కుప్పగా దాయాది దేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: 'కుక్క తోక వంకర' అన్నట్టు పాక్ వక్రబుద్ధి మరోసారి బయటపడింది. 26 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్న ముష్కరులు పొరుగు దేశం ప్రేరేపితులేనన్న వాస్తవాలు ఇప్పుడిప్పుడే ప్రపంచానికి తెలిసొస్తున్నాయి. నిజానికి పహల్గాం ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ హస్తం ఉన్నట్టు ముందు నుంచే అనుమానిస్తున్న భారత్.. అందుకు స్పష్టమైన ఆధారాలున్నాయని కూడా అంటున్నది. ఈ క్రమంలోనే దాయాది దేశాన్ని ఆర్థికంగా దెబ్బకొట్టే చర్యలకు కేంద్ర ప్రభుత్వం దిగుతున్నది. ఇందులో భాగంగానే దశాబ్దాల చరిత్ర ఉన్న సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడమేగాక, ఎంతో కీలకమైన వాఘా-అట్టారి మార్గాన్ని కూడా మూసేసింది. ఈ రెండు నిర్ణయాలు పాక్ ఎకానమీని రిస్క్‌లో పడేస్తున్నాయిప్పుడు.

ఇదీ సంగతి..

వాఘా-అట్టారి సరిహద్దు చెక్‌పోస్ట్ కేవలం మనుషుల రాకపోకలకేగాక.. భారత్-పాక్ మధ్య ఉన్న ఏకైక వ్యాపార, వాణిజ్య మార్గం. ఇప్పుడిది మూసుకుపోవడంతో ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యానికి బ్రేకులు పడ్డట్టైంది. వాఘా-అట్టారి రోడ్డు మార్గం గుండానే ఆయా వస్తూత్పత్తులు దేశాలు మారుతున్నాయి. ఇక ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యంలో భారత్‌దే పైచేయి. పాకిస్థాన్ నుంచి దిగుమతి అవుతున్న వస్తూత్పత్తుల విలువ కంటే భారత్ నుంచి పాక్‌కు ఎగుమతి అవుతున్నవాటి విలువే ఎక్కువ. అయితే పాక్ కవ్వింపు చర్యల నడుమ 2019 నుంచే ఈ వాణిజ్యం తగ్గుముఖం పట్టింది. పుల్వామా ఉగ్రదాడితో పాక్ నుంచి వచ్చే దిగుమతులపై 200 శాతం సుంకాలు పడుతున్నాయి. ప్రస్తుత ఉద్రిక్తతల వల్ల పూర్తిగా ఆగిపోయిన ట్టైంది. 2023-24లో ఈ మార్గం ద్వారా జరిగిన వాణిజ్యం విలువ రూ.3,886.53 కోట్లుగా ఉన్నది. మొత్తం వాణిజ్యం విలువ 1.3 బిలియన్ డాలర్లు. ఈ మార్గంలో 2018-19లో వాణిజ్యం రూ.4,370.78 కోట్లుగా ఉండటం గమనార్హం. మరోవైపు 1960లనాటి సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేశారు. గతంలో ఎన్నిసార్లు పాక్ దుశ్చర్యలకు పాల్పడినా.. కేంద్రం ఈ నిర్ణయం తీసుకోలేదు. కానీ ఈసారి ఆ నిర్ణయం తీసుకోవడం.. పెహల్గాం దాడిని కేంద్రం ఎంత తీవ్రంగా పరిగణిస్తున్నదోననడానికి నిదర్శనమని విశ్లేషకులు చెప్తున్నారు. ఇక ఒప్పంద నిలుపుదల పాక్ వ్యవసాయ రంగాన్ని అత్యంతగా ప్రభావితం చేయనున్నది. తూర్పు నదులు సట్లేజ్, బీస్, రవీ భారత్‌కు, పశ్చిమ నదులు ఇండస్, జీలం, చినాబ్ పాకిస్థాన్‌కు దక్కాయి. అయితే ఎగువన ఉన్న భారత్ నుంచే ఇవన్నీ పాక్‌లోకి వెళ్తుండటంతో ఒప్పందం నిలిపివేత.. ఆయా నదులపై భారత్‌కున్న స్వేచ్ఛను ఒక్కసారిగా పెంచేసింది. ఫలితంగా ఆ జలాలను భారత్ తమ అవసరాలకు వాడుకుంటే పాక్ ఎండినట్టేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



పాకిస్థాన్‌తో భారత్ వాణిజ్యం 2024-25 ఏప్రిల్-జనవరిలో 500 మిలియన్ డాలర్లుగా కూడా లేదు. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో 800 బిలియన్ డాలర్ల కుపైగానే ఉన్నది. ప్రస్తుత ఉద్రిక్తతల నడుమ వాఘా-అట్టారి చెక్‌పోస్ట్ మూసివేతతో ఈ వాణిజ్యం పూర్తిగా నిలిచిపోయింది. గడిచిన 10 నెలల్లో భారత్ నుంచి పాకిస్థాన్‌కు జరిగిన ఎగుమతుల్లో దాదాపు 60 శాతం ఆర్గానిక్ రసాయనాలు, ఔషధ ఉత్పత్తులే.

-ఎస్‌సీ రల్హాన్, ఎఫ్ఐఈవో అధ్యక్షుడు

కుప్పకూలిన పాక్ సూచీలు

పాకిస్థాన్ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. ఉగ్రదాడి నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తకర పరిస్థితులు నెలకొనడంతో ఆ దేశ స్టాక్ మార్కెట్లు నష్టపోయాయి. కేఎస్ఈ-100 సూచీ 2,206.33 పాయింట్లు కోల్పోయి 1,15,019.81 పాయింట్ల వద్ద ముగిసింది.

- భారత్ నుంచి పాకిస్థాన్‌కు సోయాబీన్, కోళ్ల దాణా, కూరగాయలు, ఎర్ర మిర్చి, ప్లాస్టిక్ తయారీ ముడిసరుకు, ప్లాస్టిక్ దారాల ఎగుమతి.
- పాకిస్థాన్ నుంచి భారత్‌కు డ్రై ఫ్రూట్స్, డైడేట్స్, జిప్సమ్, సిమెంట్, గ్లాస్, రాక్ సాల్ట్, వివిధ వన మూలికల దిగుమతి.
- 2022-23 ఆర్థిక సర్వే ప్రకారం పాకిస్థాన్ జీడీపీలో వ్యవసాయం వాటా 22.7 శాతం, వ్యవసాయం ఆధారంగా ఉపాధి పొందుతున్న వారు 37.4 శాతం.
- సింధు జలాలతోనే పాక్‌లో 80 శాతం వ్యవసాయం. భారత్ నిర్ణయంతో అక్కడ వ్యవసాయం కుంటుపడ్డట్టే. నిరుద్యోగం మరింత పెరిగే ప్రమాదం.
- ఇప్పటికే అప్పుల కుప్పగా పాకిస్థాన్. అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంక్ రుణాల ద్వారానే తీరుతున్న పాక్ అవసరాలు.
- పాక్ రుణ భారం 284 బిలియన్ డాలర్లు. ఇది ఆ దేశ జీడీపీలో 67 శాతానికి సమానం. సంక్షోభం అంచున దేశ ఆర్థిక వ్యవస్థ.
- పాకిస్థాన్‌కు శాపాలుగా మారిన నిరక్షరాస్యత, నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక క్రమశిక్షణారాహిత్యం, మత ఛాందసం, పరిపాలనా వైఫల్యాలు.
- పాకిస్థాన్ తీరుతో ఇరుగుపొరుగు దేశాలతో దెబ్బతిన్న సత్సంబంధాలు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తుండటంతో దూరంగా ఉంటున్న ప్రపంచ దేశాలు.
- ఇస్లామిక్ దేశాలతోనూ సంబంధాలు అంతంతే. సరిహద్దు దేశం చైనాతోనూ చెడుతున్నమైత్రి. వాడుకొని వదిలేస్తున్న డ్రాగన్.
- మితిమీరిన ద్రవ్యోల్బణంతో దుర్భరంగా ప్రజల జీవన పరిస్థితులు. ఉగ్రవాదం, హింస వైపు యువత.

హైదరాబాద్‌లో ఏబీసీ ఇన్నోవేషన్ సెంటర్

హైదరాబాద్, ఏప్రిల్ 24: ఫిట్‌నెస్ బిజినెస్‌కు సంబంధించి అంతర్జాతీయంగా టెక్నాలజీ సేవలు అందిస్తున్న అమెరికాకు చెందిన ఏబీసీ ఫిట్‌నెస్..భారత్‌లో తొలిసారిగా హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ హబ్‌ను నెలకొల్పింది. సాఫ్ట్‌వేర్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్‌పై మరింత దృష్టి సారించడంలో భాగంగా ఈ సెంటర్‌ను నెలకొల్పినట్టు, దీంతో తొలి ఏడాదిలో 200 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రొడక్ట్ ఇన్నోవేషన్, వరల్డ్-క్లాస్ టెక్నాలజీ సేవలు అందించడానికి ఈ సెంటర్ ఉపయోగపడనున్నదన్నారు.

సూచీల వరుస ర్యాలీకి బ్రేక్

ముంబై, ఏప్రిల్ 24: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. మదుపరులు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపడంతోపాటు కార్పొరేట్ల నిరుత్సాహక ఆర్థిక ఫలితాలు సూచీలను నష్టాల్లోకి నెట్టింది. బ్లూచిప్ సంస్థల షేర్లు కుప్పకూలడం, ఆసియా-యూరప్ ఈక్విటీలు ఒడిదుడుకులకు లోనుకావడం మదుపరులను అమ్మకాలవైపు నడిపించాయి. ఫలితంగా ఏడు రోజులుగా భారీగా పుంజుకున్న సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో 400 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 315.06 పాయింట్లు కోల్పోయి 79,801.43 వద్ద ముగిసింది. మరోసూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 82.25 పాయింట్లు కోల్పోయి 24,246.70 వద్ద స్థిరపడింది. గడిచిన ఏడు రోజుల్లో సెన్సెక్స్ 6,269.34 పాయింట్లు లేదా 8.48 శాతం, నిఫ్టీ 1,929.8 పాయింట్లు లేదా 8.61 శాతం చొప్పున పెరిగిన విషయం తెలిసిందే. కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలు మార్కెట్ల ర్యాలీకి బ్రేక్‌లు వేశాయని జియోజిట్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ షేరు 4 శాతం తగ్గి టాప్ లూజర్‌గా నిలిచింది.
- దీంతోపాటు భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఎన్‌టీపీసీ, అదానీ పోర్ట్స్, ఐటీసీ, కొటక్ బ్యాంక్, మారుతి, ఎస్బీఐ షేర్లు నష్టపోయాయి.
- కానీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా మోటర్స్, సన్‌ఫార్మా, టైటాన్, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, టాటా స్టీల్, రిలయన్స్, యాక్సిస్ బ్యాంక్, నెస్లె, ఎల్అండ్‌టీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా చూస్తే రియల్టీ అత్యధికంగా 1.39 శాతం నష్టపోగా, ఎఫ్ఎంసీజీ, టెక్నాలజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, కన్జ్యూమర్, ఐటీ, పవర్ రంగ సూచీలు నష్టపోయాయి.

ఆలేరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, వేదికపై మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు

మదర్ డెయిరీకి 50 కోట్లు ఇచ్చి ఆదుకోవాలి

- పది రోజులకోసారి బిల్లులు చెల్లించాలి
- బకాయిలు విడుదల చేయాలి
- మాజీ ఎమ్మెల్యేలు భిక్షమయ్యగౌడ్, జూలకంటి రంగారెడ్డి

ఆలేరు టౌన్, ఏప్రిల్ 24 : నష్టాల్లో కూరుకుపోయిన మదర్ డెయిరీకి రూ.50 కోట్లు ఇచ్చి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో గురువారం పాల సంఘం రాష్ట్ర కన్వీనర్ మంగ నరసింహులు అధ్యక్షతన పాల రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రంగారెడ్డితోపాటు ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదర్ డెయిరీ సంస్థ ఆస్తులను అమ్మాలని పాలకవర్గం నిర్ణయించడం దారుణమని విమర్శించారు. పాడి రైతుల కష్టార్జితంతో కూడబెట్టిన ఆస్తులను అమ్మాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఇన్సెంటివ్‌ను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, పశువులకు బీమా కల్పించాలని, వ్యవసాయ కార్మికులకు 90 శాతం సబ్సిడీపై పాడి పశువులను పంపిణీ చేయాలని, పశువుల కొట్టం నిర్మాణానికి రూ.2 లక్షల సబ్సిడీ ఇవ్వాలని, పాల రైతులకు రూ.3 లక్షల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా లీటర్ పాలకు రూ.80 చెల్లించాలని, పది రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించాలని, ప్రైవేటు పాల సేకరణను నియంత్రించి రైతులకు నష్టం జరుగకుండా చూడాలని కోరారు.

సూర్యాపేటలో నకిలీ డాక్టర్లు

- తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తనిఖీల్లో వెల్లడి

సూర్యాపేట, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేటలో పెద్ద సంఖ్యలో నకిలీ డాక్టర్లు వైద్యం అందిస్తున్న విషయం బహిర్గతమైంది. తెలంగాణ వైద్య మండలి సభ్యులు గురువారం జిల్లా కేంద్రంలోని స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ దవాఖానల్లో చేపట్టిన విస్తృత తనిఖీలతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. యాపిల్ స్కానింగ్ సెంటర్‌లో క్వాలిఫైకాని డాక్టర్ స్కానింగ్ చేస్తుండడంతో వైద్య మండలి సభ్యులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సాయిగణేశ్ దవాఖానలో అర్హతలేని డాక్టర్ వైద్యం చేస్తున్నట్టు, శ్రీకృష్ణ దవాఖానలో అర్హతలేని వైద్యులను కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకువచ్చినట్టు తనిఖీల్లో గుర్తించారు. వీటిపై మెడికల్ కౌన్సిల్ సభ్యులు, ఐఎంఏ డాక్టర్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు ఫిర్యాదు చేశారు.

5కోట్లు ఇవ్వాలని జుక్కల్ ఎమ్మెల్యేకు బెదిరింపు

- ఎమ్మెల్యే ఫిర్యాదుతో యూట్యూబర్ అరెస్టు

బండ్లగూడ, ఏప్రిల్ 24: జుక్కల్ ఎమ్మెల్యేను బెదిరించిన ఓ యూట్యూబర్‌ను రాజేంద్రనగర్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. డిప్యూటీ కమిషనర్ చింతమనేని శ్రీనివాస్ వివరాల ప్రకారం.. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు తనను అప్రతిష్ఠ పాలుచేసే వార్తలు ప్రసారం చేస్తానని ప్రజావాయిస్ న్యూస్‌చానల్ యూట్యూబర్ శ్యాంసుందర్ బెదిరిస్తున్నాడని, వార్తా ప్రసారం కాకుండా ఉండాలంటే రూ.5కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిరుపమా అనిల్‌కుమార్ దాదానియాతో కలిసి తప్పుడు సాక్షాలు సృష్టించి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు శ్యాం సుందర్‌పై బీఎంఎస్ 439, 308, 351(3), 352,61(2)3(5) ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, కోర్టు వద్ద యూట్యూబర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఓ మహిళతో సహజీవనం చేసి ఓ బిడ్డను కన్నాడని తెలిపాడు. ఆ మహిళ తనకు న్యాయం చేయాలని సంప్రదించడంతో ఎమ్మెల్యేకి ఫోన్ చేసినట్టు పేర్కొన్నాడు. దీంతో తనపై బ్లాక్‌మెయిల్ కేసు నమోదు చేశారని తెలిపాడు.

సివిల్స్ విజేతలకు డీజీపీ అభినందన

- పోలీసు కుటుంబాల నుంచి ఎంపికవడంపై హర్షం

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : పోలీస్ కుటుంబాల నుంచి సివిల్స్‌కు ఎంపికైన ముగ్గురిని డీజీపీ డాక్టర్ జితేందర్ గురువారం అభినందించారు. 68వ ర్యాంకు సాధించిన జే సాయిచైతన్య తండ్రి గోవిందు డిచ్‌పల్లిలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తుండగా, 225 ర్యాంకు పొందిన ఏ కౌశిక్ నరసింహ తండ్రి ఏ వేణుగోపాల్ డీజీపీ కార్యాలయంలో డీఎస్పీగా పనిచేస్తున్నారు. 779 ర్యాంకు పొందిన టీ సూర్యతేజ తండ్రి టీ కరుణాకర్ అసెంబ్లీలో చీఫ్ మార్షల్‌గా పనిచేస్తున్నారు. పోలీస్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది కుమారులు సివిల్ సర్వీసెస్‌కు ఉత్తమ ర్యాంక్‌లతో ఎంపిక కావడం సంతోషం అని, సమాజానికి ఉపయోగపడేలా సేవ చేయాలని డీజీపీ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీజీ మహేష్ ఎం భగవత్, సీఐడీ డీజీ శిఖా గోయల్, అడిషనల్ డీజీ అనిల్ కుమార్, ఐజీలు ఎం రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం ఉగ్రదాడి దుర్మార్గం

- బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర
- రంగారెడ్డి కోర్టు వద్ద న్యాయవాదుల నిరసన ప్రదర్శన

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో 26 మంది పర్యాటకులపై ఉగ్రదాడి దుర్మార్గమని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర పేర్కొన్నారు. దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. తీవ్రవాద కార్యకలాపాలకు వ్యతిరేకంగా గురువారం రంగారెడ్డి జిల్లా కోర్టు వద్ద న్యాయవాదులు పెద్దఎత్తున నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ.. ఇలాంటి సమయంలో దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలను సర్జికల్ స్ట్రైక్ ద్వారా ఏరివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పులిహారి గోవర్ధన్ రెడ్డి, ఉపేంద్ర, రామచంద్రారావు సత్యనారాయణరెడ్డి, విప్లవరెడ్డి, ప్రదీప్, నరేశ్, రాజేశ్వర్‌రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

టీజీవో ఆధ్వర్యంలో సంతాపం..

పహల్గాం ఉగ్రదాడి హేయమైన చర్య అని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు గురువారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సంతాపం ప్రకటించింది. దాడిలో మరణించిన బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానూభూతి తెలిపింది. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి ఏనుగు సత్యనారాయణ, నాయకులు శ్యామ్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

ఉగ్ర దాడిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని బార్ అసోసియేషన్లు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. ఉగ్రవాదుల దాడిని బార్ కౌన్సిల్ తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు.

ఆర్టీఏలో ఫ్యాన్సీ నంబర్ల స్కామ్?

- గతంలో 20 లక్షలు పలికిన 9999
- తాజాగా రూ.99,999 పరిమితం
- ఆన్‌లైన్‌లోనే అధికారుల మాయాజాలం
- ఇంటి దొంగల చేతివాటంతో రాబడికి గండి
- రవాణాశాఖ అధికారుల లోతైన విచారణ?

బిడ్డింగ్ అప్పుడలా.. ఇప్పుడెందుకిలా?

వేలం సమయం	నంబర్	పలికిన ధర
2024 జూలై	టీజీ 09 ఏ 9999	రూ.19.51 లక్షలు
2024 సెప్టెంబర్	టీజీ 09 బీ 9999	రూ.20.01 లక్షలు
2024 నవంబర్	టీజీ 09 సీ 9999	రూ.7.19 లక్షలు
2025 జనవరి	టీజీ 09 డీ 9999	రూ.6.26 లక్షలు
2025 మార్చి	టీజీ 09 ఈ 9999	రూ.99,999

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): ఆర్టీఏ ఫ్యాన్సీ నంబర్లలో కొందరు రవాణాశాఖ అధికారులు కొత్త పద్ధతుల్లో కుంభకోణాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్టీఏకు రూ.లక్షల ఆదాయం సమకూర్చే ఫ్యాన్సీ నంబర్లలో చేతివాటం ప్రదర్శిస్తూ జేబులు నింపుకుంటున్నట్టు సమాచారం. దీనిపై రవాణాశాఖలో రహస్యంగా విచారణ జరుగుతున్నట్టు తెలుస్తున్నది.

ఒకే వ్యక్తి.. ఎక్కువ మెయిల్స్?

ఫ్యాన్సీ నంబర్ల ధరలను ఆన్‌లైన్‌లో తక్కువ చేసి, చూపించడం వెనుక కొందరు అధికారులు ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకే వ్యక్తితో ఎక్కువ మెయిల్స్ ద్వారా బిడ్డింగ్‌లు వేయిస్తూ అనుకున్న ధర కోట్ చేసిన తర్వాత సాంకేతిక సమస్యలు ఏర్పడేలా చేస్తున్నారని తెలుస్తున్నది. వేరేవాళ్లు వేలంలో పాల్గొనకుండా, ఎక్కువ ధర పలకకుండా అక్రమాలకు పాల్పడుతున్నట్టు సమాచారం.

కుంభకోణంపై చర్యలేవీ?

నిరుడు అక్టోబర్‌లో రవాణాశాఖలో కొందరు అధికారులు, ఏజెన్సీ సిబ్బంది ఫ్యాన్సీ నంబర్ల కుంభకోణానికి పాల్పడ్డట్టు తేలింది. వేలం ప్రక్రియలోని వివరాలను కావాల్సిన వారికి లీక్ చేశారని స్పష్టమైంది. కానీ వారిపై ఉన్నతాధికారులు నామమాత్రపు చర్యలతో సరిపెట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్టీఏలో ఫ్యాన్సీ నంబర్ల కుంభకోణాలు ఇంతగా జరుగుతున్నా... ఉన్నతాధికారులు తూతూమంత్రం చర్యలతో సరిపెట్టడంలో ఆంతర్యంఏమిటి? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

హవాలా దందాపై ఈడీ దాడులు

- హైదరాబాద్‌లోని 10 ప్రాంతాల్లో సోదాలు
- భారీగా లభ్యమైన నగదు, లోతుగా దర్యాప్తు

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని పలువురు హవాలా వ్యాపారుల ఇండ్లు, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు గురువారం దాడులు చేశారు. గతంలో విదేశీ సిగరెట్ల స్మగ్లింగ్, ఫారిన్ కరెన్సీ, గుట్కా దందా ముసుగులో సాగుతున్న హవాలాపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇ